సాక్షి
నల్లగొండ
శుక్రవారం, 16, ఫిబ్రవరి, 2024



**నేడు రథ సప్తమి వేడుకలు**
యాదాద్రిలో శుక్రవారం రథ సప్తమి వేడుకలు నిర్వహించేందుకు ఏర్పాట్లు పూర్తి చేశారు. - 8లో



**నేడు అంకురార్పణ**
చెర్వుగట్టు వార్షిక బ్రహ్మోత్సవాలకు శుక్రవారం ప్రత్యేక పూజలు నిర్వహించి అంకురార్పణ చేయనున్నారు. - 8లో



**మట్టపల్లిలో నిత్య కల్యాణం**
మట్టపల్లి లక్ష్మీనరసింహస్వామి దేవాలయంలో నిత్య కల్యాణాన్ని అర్చకులు వైభవంగా జరిపించారు. - 8లో

# వాస్తవికత ఎంత!

## నకిలీ సర్టిఫికెట్లతో కొందరు కాంట్రాక్ట్ లెక్చరర్లు రెగ్యులరైజ్ అయ్యారని ఆరోపణలు

- నల్లగొండ బాలికల జూనియర్ కళాశాలలో ఓ లెక్చరర్ తొలగింపు
- మరో 11 మందిపై ఏసీబీ డీజీకి ఓయూ స్కాలర్ ఫిర్యాదు
- వీరిలో ఉమ్మడి జిల్లాకు చెందిన వారే ఎనిమిది మంది



సాక్షి ప్రతినిధి, నల్లగొండ : ప్రభుత్వ జూనియర్ కళాశాలల్లో పనిచేసే కాంట్రాక్టు లెక్చరర్ల రెగ్యులరైజేషన్ విషయంలో సర్టిఫికెట్ల వాస్తవికత(జెన్యూనిటీ)పై లొల్లి రాజుకుంది. 20 ఏళ్లుగా ప్రభుత్వ జూనియర్ కళాశాలలో కాంట్రాక్టు పద్ధతిన పనిచేస్తున్న లెక్చరర్లను వారి అర్హతను బట్టి గతేడాది మే నెలలో రెగ్యులరైజేషన్ చేసేందుకు ప్రభుత్వం శ్రీకారం చుట్టింది. అయితే అందులో యూనివర్సిటీ గ్రాంట్స్ కమిషన్ (యూజీసీ) అనుమతి లేని వాటి నుంచి తెచ్చుకున్న సర్టిఫికెట్ల ఆధారంగా కొంతమందిని రెగ్యులరైజ్ చేసినట్లు ఉస్మానియా యూనివర్సిటీకి స్కాలర్ శంకర్ ఏసీబీ డైరెక్టర్ జనరల్‌కు బుధవారం రాత పూర్వకంగా ఫిర్యాదు చేశారు. అందులో 11 మంది కాంట్రాక్టు లెక్చరర్ల పేర్లను పొందుపరిచారు. వీరితో పాటు చాలా మంది చెల్లని సర్టిఫికెట్లను పెట్టారని, ఈ వ్యవహారంలో సమగ్ర విచారణ జరిపించాలని కోరారు.. ఆ 11 మందిలో 8 మంది ఉమ్మడి నల్లగొండ జిల్లాకు చెందిన వారే ఉండడం గమనార్హం. ఈ వ్యవహారంలో ఇంటర్ విద్యాశాఖ ఆర్జేడీ, కొంతమంది ప్రిన్సిపాళ్లు అవినీతికి పాల్పడినట్లు ఆరోపణలు ఉన్నాయి. అయితే చెల్లని సర్టిఫికెట్ల వ్యవహారంలో ఇప్పటికే నల్లగొండలో ఒక లెక్చరర్‌ను సర్వీసు నుంచి అధికారులు తొలగించారు.

**332 మంది కాంట్రాక్టు లెక్చరర్లు**

ఉమ్మడి నల్లగొండ జిల్లాలో 30 ప్రభుత్వ జూనియర్ కాలేజీలు ఉన్నాయి. వాటి పరిధిలో 332 మంది కాంట్రాక్టు లెక్చరర్లు 20 ఏళ్లుగా పని చేస్తున్నారు. 2014కు ముందు కేసీఆర్ బీఆర్ఎస్ ప్రభుత్వం అధికారంలోకి వస్తే కాంట్రాక్టు ఉద్యోగులను రెగ్యులరైజ్ చేస్తామని హామీ ఇచ్చారు. అనుకున్న విధంగానే అధికారంలోకి రావడంతో రెగ్యులరైజ్ చేసేందుకు ప్రభుత్వం చర్యలు చేపట్టింది. ఈ విషయమై కోర్టులో కొందరు కేసులు వేయడంతో ఆ ప్రక్రియ ఆగిపోయింది. దీంతో అప్పటి సీఎం కేసీఆర్ ప్రభుత్వ లెక్చరర్లతో సమానంగా వారికి వేతనాలు పెంచారు. ఆ తరువాత కోర్టు కేసు తొలగిపోవడంతో 2023లో రెగ్యులరైజేషన్‌కు ప్రభుత్వం చర్యలు చేపట్టింది. అందుకు పీజీతో పాటు ఇతర అర్హతలను నిర్ణయించింది. ఆ నిబంధనల ప్రకారం ఉన్న వారిని రెగ్యులరైజ్ చేస్తామని ప్రకటించింది. వీరిలో చాలా మంది గుర్తింపు లేని యూనివర్సిటీల నుంచి పీజీ సర్టిఫికెట్లు తెచ్చి విద్యాశాఖకు సమర్పించినట్లు ఆరోపణలు వెల్లువెత్తాయి. దీంతో విద్యాశాఖ అధికారులు ఫిర్యాదు వచ్చిన వారిపై జెన్యూనిటీ సర్టిఫికెట్ కోసం ఆయా యూనివర్సిటీలకు లేఖలు రాశారు. యూనివర్సిటీల నుంచి ఆ సర్టిఫికెట్లు జెన్యూనిటీ అని సమాధానం రావడంతో వారిని రెగ్యులరైజ్ చేశారు. ఉమ్మడి జిల్లాలో ఇప్పటి వరకు 257 మందిని రెగ్యులరైజ్ చేశారు. వీరిలో కొంత మందివి చెల్లని సర్టిఫికెట్లు అన్న ఆరోపణలు ఉన్నాయి.

**ఉమ్మడి జిల్లాలో కాంట్రాక్టు లెక్చరర్లు ఇలా..**

| జిల్లా | కాలేజీలు | లెక్చరర్లు | రెగ్యులరైజ్ | రెగ్యులరైజ్ కావాల్సినవారు |
|---|---|---|---|---|
| నల్లగొండ | 12 | 143 | 108 | 35 |
| సూర్యాపేట | 7 | 78 | 64 | 14 |
| యాదాద్రి | 11 | 111 | 85 | 26 |
| మొత్తం | 30 | 332 | 257 | 75 |

**సర్వీస్ నుంచి లెక్చరర్ తొలగింపు**

నల్లగొండ జిల్లా కేంద్రంలోని బాలికల జూనియర్ కాలేజీలో పనిచేసే కాంట్రాక్టు లెక్చరర్ ఆయేషా పర్వీనా చెల్లని సర్టిఫికెట్‌తో రెగ్యులరైజ్ అయ్యారన్న ఆరోపణలు వచ్చాయి. దీనిపై ఫిర్యాదులు వెళ్లడంతో ఉన్నత స్థాయిలో విచారణకు ఆదేశించారు. దీంతో ఆమె చెల్లని సర్టిఫికెట్ పెట్టినట్లు తేలడంతో సర్వీసు నుంచి తొలగించినట్లు నల్లగొండ డీఐఈఓ దస్రూనాయక్ తెలిపారు.

**జెన్యూనిటీ కూడా తప్పే అంటూ ఆరోపణలు**

యూజీసీ నుంచి ఎలాంటి గుర్తింపు లేని యూనివర్సిటీల్లో చదివిన డిగ్రీలు చెల్లుబాటు కావు. అలాంటప్పుడు ఆ సర్టిఫికెట్లను పెట్టి ఎలా రెగ్యులరైజ్ చేస్తారంటూ ఆరోపణలు వచ్చాయి. జెన్యూనిటీ అనేది ఆ యూనివర్సిటీలు ఇస్తే జెన్యూన్ ఎలా అవుతుందన్న ప్రశ్నలు వస్తున్నాయి. వాస్తవంగా దేశ్యాప్తంగా.. రాష్ట్రాల్లో ఏయే యూనివర్సిటీలకు తమ గుర్తింపు ఉందనేది యూజీసీ ఏటా ప్రకటిస్తుంది. అయితే యూజీసీ గుర్తింపు లేని యూనివర్సిటీల నుంచి తెచ్చిన సర్టిఫికెట్లు ఎలా జన్యూన్ అవుతాయని నిరుద్యోగులు ప్రశ్నిస్తున్నారు. వాటి ఆధారంగా ఎలా రెగ్యులరైజ్ చేస్తారంటూ ఆందోళన వ్యక్తం చేస్తున్నారు.

• కమ్మేసిన మంచు



నల్లగొండ పట్టణాన్ని గురువారం మంచు కమ్మేసింది. ఉదయం 8 గంటలకు వరకు మంచు తగ్గకపోవడంతో వాహనదారులు ఇబ్బంది పడ్డారు. - సాక్షి స్టాఫ్ ఫోటోగ్రాఫర్, నల్లగొండ

## బెడ్ షీట్ల తయారీపై దృష్టిపెట్టాలి

- కలెక్టర్ హరిచందన



పద్మానగర్‌లో పవర్‌లూమ్ యూనిట్లను పరిశీలిస్తున్న కలెక్టర్ హరిచందన

నల్లగొండ : పంచెలు, లుంగీలతో పాటు బెడ్‌షీట్ల తయారీపై దృష్టి సారించాలని కలెక్టర్ హరిచందన మరమగ్గం నేత కార్మికులకు సూచించారు. గురువారం ఆమె నల్లగొండలోని పద్మానగర్‌లో పవర్ లూమ్ యూనిట్లను సందర్శించారు. ఈ సందర్భంగా ఆమె మార్కెటింగ్, రా మెటీరియల్, లాభాలు తదితర విషయాలను అడిగి తెలుసుకున్నారు. అనంతరం మాట్లాడుతూ జిల్లాలోని మరమగ్గాల ద్వారా నేత కార్మికులంతా పంచెలు, లుంగీలతో పాటు, బెడ్‌షీట్లను తయారు చేయాలన్నారు. వీటిని ఆస్పత్రులు, హాస్టళ్లలో ఎక్కువగా వినియోగించుకునేందుకు అవకాశం ఉంటుందన్నారు. కాటన్, సిల్క్ ఉత్పత్తులపై దృష్టి సారించాలని సూచించారు. పవర్‌లూమ్ ద్వారా మరిన్ని ఉత్పత్తులు చేపట్టి ఆర్థికంగా ఎదగాలని ఆకాంక్షించారు. కార్యక్రమంలో అదనపు కలెక్టర్ హేమంత్ కేశవ్ పాటిల్, చేనేత శాఖ డెవలప్‌మెంట్ ఆఫీసర్ రంజిత్‌కుమార్, నేత సంఘాల ప్రతినిధులు, తదితరులు పాల్గొన్నారు.

## నందికొండలో నెగ్గిన అవిశ్వాసం



అవిశ్వాసానికి మద్దతుగా చేతులెత్తిన కౌన్సిలర్లు

నాగార్జునసాగర్ : నందికొండ మున్సిపాలిటీలో చైర్‌పర్సన్, వైస్ చైర్మన్‌పై పెట్టిన అవిశ్వాసం నెగ్గింది. గ్రామపంచాయతీ కూడా కాని నాగారునసాగర్ ప్రాజెక్టు కాలనీలను నందికొండ పేరుతో గత బీఆర్ఎస్ ప్రభుత్వం మున్సిపాలిటీ చేసింది. తొలి ఎన్నికల్లో కాంగ్రెస్ పార్టీ 3, బీఆర్ఎస్ పార్టీ 9 కౌన్సిలర్లను గెలిపొందాయి. బీఆర్ఎస్ నుంచి గెలిచిన కర్ణ అనూషాశరత్‌రెడ్డిని చైర్‌పర్సన్‌గా, బిన్ని అలియాస్ మందా రఘువీర్‌కుమార్‌ను వైస్ చైర్మన్‌గా ఎన్నుకున్నారు. కౌన్సిల్ కొలువుదీరాక మొదటి సమావేశం నుంచే బీఆర్ఎస్ కౌన్సిలర్లు రెండు గ్రూప్‌లుగా విడిపోయారు. అవిశ్వాసం పెట్టేందుకు ప్రభుత్వం నాలుగేళ్ల గడువు విధించడంతో.. ఆ సమయం పూర్తి కాగానే కౌన్సిలర్లు చైర్‌పర్సన్, వైస్ చైర్మన్‌పై అవిశ్వాసం పెడుతూ నోటీసులు ఇచ్చారు. ఆ నోటీసులపై వైస్‌చైర్మన్ హైకోర్టునుంచి స్టే తెచ్చారు. ఆ స్టే వెకెట్ కావడంతో ఈనెల 20వ తేదీన అవిశ్వాసం పెట్టేందుకు ప్రభుత్వం నిర్ణయించింది. అయితే పార్లమెంట్ ఎన్నికల కోడ్ వస్తే అవిశ్వాసం పెట్టడానికి వీలుపడదని ఈ నెల15నే అవిశ్వాసం పెట్టేందుకు ప్రభుత్వం నుంచి నోటీసులు ఇప్పించి గురువారం మిర్యాలగూడ ఆర్డీఓ చెన్నయ్య అధ్యక్షతన అవిశ్వాసం పెట్టారు.

**అవిశ్వాసం సాగిందిలా..**

నందికొండ మున్సిపాలిటీలో 12 మంది కౌన్సిలర్లకు గాను 9 మంది బీఆర్ఎస్, ముగ్గురుకాంగ్రెస్ పార్టీకి చెందిన వారు గెలుపొందారు. ఇందులో కాంగ్రెస్ పార్టీకి చెందిన ఒక కౌన్సిలర్ ఒకరు చనిపోయారు. అసెంబ్లీ ఎన్నికల సమయంలో బీఆర్ఎస్‌కు చెందిన ఇద్దరు కౌన్సిలర్లు కాంగ్రెస్ పార్టీలో చేరారు. గురువారం నిర్వహించిన అవిశ్వాస తీర్మాన సమావేశానికి చైర్‌పర్సన్, వైస్‌చైర్మన్ హాజరుకాలేదు. సమావేశానికి వచ్చిన తొమ్మిది మంది కౌన్సిలర్లు చైర్‌పర్సన్ కర్ణ అనూషాశరత్‌రెడ్డి, వైస్ చైర్మన్ బిన్నిలపై పెట్టిన అవిశ్వాసానికి అనుకూలంగా చేతులెత్తారు. దీంతో వారు పదవులు కోల్పోయారు. వారం పది రోజుల్లో నూతన చైర్‌పర్సన్, వైస్ చైర్మన్‌ను ఎన్నుకునే అవకాశం ఉంది. ప్రస్తుతం ఏడుగురు బీఆర్ఎస్ పార్టీలో కొనసాగుతుండగా.. నలుగురు కాంగ్రెస్ వైపు ఉన్నారు. కాగా, కాంగ్రెస్ పార్టీకి చెందిన కౌన్సిలర్ చైర్‌పర్సన్ అయ్యేందుకు పావులు కదుపుతున్నట్లు సమాచారం.

## ఉత్తమ సమాజ స్థాపకుడు సేవాలాల్



పూజలో పాల్గొన్న ఎంజీయూ వీసీ, విద్యార్థులు, అధ్యాపకులు

ఎంజీయూ (నల్లగొండ రూరల్) : ఉత్తమ సమాజ స్థాపకుడు సంత్ సేవాలాల్‌అని మహాత్మాగాంధీ యూనివర్సిటీ వీసీ గోపాల్‌రెడ్డి కొనియాడారు. గురువారం ఎంజీయూలో సంత్ సేవాలాల్ 285వ జయంతిని ఘనంగా నిర్వహించారు. సందర్భంగా వీసీ మాట్లాడుతూ వెనుకబడిన బంజారాను జ్ఞాన బోధనతో తాత్విక పునాదినిచ్చిన దీపం సేవాలాల్ అని కీర్తించారు. కేవలం జ్ఞానం మాత్రమే మనిషిని సమానత్వం వైపు నడిపిస్తుందన్నారు. అంతకు ముందు పూజలు, సాంస్కృతిక కార్యక్రమాలు నిర్వహించి ప్రతిభ చూపిన విద్యార్థులకు బహుమతులు అందజేశారు. కార్యక్రమంలో రిజిస్ట్రార్ అల్వాల రవి, మద్దిలేటి, ప్రేమ్‌సాగర్, అరుణ ప్రియ, ఆకుల రవి, సురేష్‌రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

## చెరువు కబ్జాను అడ్డుకున్న అధికారులు

మిర్యాలగూడ : భూముల ధరలకు రెక్కలు రావడంతో పట్టణ సమీప గ్రామాల్లో కొందరు చెరువులను కబ్జా చేస్తున్నారు. గురువారం మిర్యాలగూడ మండల పరిధిలోని శ్రీనివాస్‌నగర్‌కు చెందిన చెరువును అదే గ్రామానికి చెందిన ఒక రైతు కబ్జాకు పాల్పడుతున్న విషయాన్ని గ్రామస్తులు ఐబీ అధికారులకు సమాచారం అందించారు. చెరువులో నీళ్లు లేకపోవడంతో చెరువు హద్దును దాటి మట్టితో పట్టపగలే జేసీబీలు, ట్రాక్టర్లతో చదును చేసుకుంటూ హద్దురాళ్లు పెట్టి కబ్జాకు పాల్పడుతున్నారు. దీనిపై స్పందించిన ఇరిగేషన్ శాఖ డీఈ వెంకటరమణ, జేఈ రామకృష్ణ సంఘటన స్థలానికి చేరుకుని ఆక్రమణకు పాల్పడుతున్న వారిపై మిర్యాలగూడ రూరల్ పోలీసులకు ఫిర్యాదు చేశారు. జేసీబీలు, ట్రాక్టర్లను స్వాధీనం చేసుకుని కేసు నమోదు చేశారు. దీనిపై డీఈ వెంకటరమణ మాట్లాడుతూ చెరువులను కబ్జా చేస్తే చట్టపరమైన చర్యలు తీసుకుంటామని, ఎలాంటి వారినైనా ఉపేక్షించేదిలేదని హెచ్చరించారు.

## మేడిగడ్డపై సమగ్ర విచారణ జరిపించాలి

- సీపీఎం రాష్ట్ర కార్యదర్శివర్గ సభ్యుడు జూలకంటి రంగారెడ్డి



మాట్లాడుతున్న జూలకంటి రంగారెడ్డి

నల్లగొండటౌన్ : మేడిగడ్డ ప్రాజెక్టుపై సమగ్ర విచారణ జరిపించి బాధ్యులపై చర్యలు తీసుకోవాలని సీపీఎం రాష్ట్ర కార్యదర్శివర్గ సభ్యుడు జూలకంటి రంగారెడ్డి ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. గురువారం స్థానిక దొడ్డి కొమరయ్య భవన్‌లో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడారు. జిల్లా పెండింగ్ ప్రాజెక్టులకు నిధుల కేటాయింపులో గత బీఆర్ఎస్ ప్రభుత్వం నిర్లక్ష్యంగా వ్యవహరించిందన్నారు. ప్రస్తుత కాంగ్రెస్ ప్రభుత్వం వెంటనే పెండింగ్ ప్రాజెక్టులకు నిధులు కేటాయించాలని డిమాండ్ చేశారు. జిల్లాలో ఇటీవల బీఆర్ఎస్ పార్టీ నిర్వహించిన బహిరంగ సభకు కేసీఆర్ జిల్లా ప్రజలకు క్షమాపణ చెప్పి వస్తే బాగుండేదన్నారు. కేంద్ర ప్రభుత్వం అనుసరిస్తున్న ప్రజావ్యతిరేక విధానాలకు నిరసనగా శుక్రవారం నిర్వహించనున్న దేశవ్యాప్త సమ్మెకు సీపీఎం సంపూర్ణ మద్దతు ఇస్తోందన్నారు. సమావేశంలో ఆ పార్టీ జిల్లా కార్యదర్శి ముదిరెడ్డి సుధాకర్‌రెడ్డి, డబ్బికార్ మల్లేష్, తుమ్మల వీరారెడ్డి, నారి ఐలయ్య, పాలడుగు నాగార్జున, బండ శ్రీశైలం, పాలడుగు ప్రభావతి, కందాల ప్రమీల, చినపాక లక్ష్మీనారాయణ, దండెంపల్లి సత్తయ్య తదితరులు పాల్గొన్నారు.

## ఎంపీడీఓలకు మండలాల కేటాయింపు



బదిలీపై వచ్చిన ఎంపీడీఓలతో జెడ్పీ చైర్మన్ నరేందర్‌రెడ్డి

నల్లగొండ : పార్లమెంట్ ఎన్నికల సందర్భంగా జరిగిన బదిలీల్లో భాగంగా నల్లగొండ జిల్లాకు వచ్చిన 26 మంది ఎంపీడీఓలకు జెడ్పీ చైర్మన్ బండా నరేందర్‌రెడ్డి గురువారం మండలాల కేటాయింపు ఉత్తర్వులు అందజేశారు. ఈ సందర్భంగా ఆయన ఎంపీడీఓలకు శుభాకాంక్షలు తెలిపారు. సమర్థంగా విధులు నిర్వహించాలని సూచించారు. కార్యక్రమంలో జెడ్పీ సీఈఓ ప్రేమ్‌కరణ్‌రెడ్డి, డిప్యూటీ సీఈఓ బి. శ్రీనివాస్‌రావు, కొప్పు రాంబాబు తదితరులు ఉన్నారు.

## గ్రామీణ భారత్ బంద్‌కు యూఎస్‌పీసీ మద్దతు




నల్లగొండలో నిరసన ప్రదర్శన నిర్వహిస్తున్న ఉపాధ్యాయులు

నల్లగొండ : గ్రామీణ భారత్ బంద్‌కు మద్దతుగా యూఎస్‌పీసీ (ఉపాధ్యాయ సంఘాల పోరాట కమిటీ) ఆధ్వర్యంలో గురువారం నల్లగొండలోని గడియారం సెంటర్ వద్ద ఉపాధ్యాయులు నిరసన ప్రదర్శన నిర్వహించారు. ఈ సందర్భంగా ఆ సంఘం రాష్ట్ర అధ్యక్షుడు సోమయ్య మాట్లాడుతూ శుక్రవారం జరిగే గ్రామీణ భారత్ బంద్‌కు సంపూర్ణ మద్దతు ఇస్తామని తెలిపారు. కార్యక్రమంలో ఖుర్షిద్‌మియా, నర్రా శేఖర్‌రెడ్డి, బడుగు అరుణ, సంతోషం, నలపరాజు వెంకన్న, గేర నర్సింహ, మురళయ్య, ఎరనాగుల సైదులు తదితరులు పాల్గొన్నారు.

# నత్తనడకన.. గృహజ్యోతి

- మార్చి నుంచి 200 యూనిట్ల ఉచిత విద్యుత్ ఇస్తామని ప్రకటించిన ప్రభుత్వం
- గడువు ముగిసినా పూర్తికాని ఆన్‌లైన్ ప్రక్రియ
- పార్లమెంట్ ఎన్నికల కోడ్ వస్తే వాయిదా పడే చాన్స్



నల్లగొండ : గృహజ్యోతి పథకం కింద గృహాలకు 200 యూనిట్ల ఉచిత విద్యుత్ అందించే ప్రక్రియ నత్తనడకన సాగుతోంది. మార్చి నెల నుంచి ఈ పథకాన్ని అమలు చేసేందుకుగాను.. ఈనెల 15వ తేదీలోగా రేషన్ కార్డు, విద్యుత్ సర్వీస్ నంబర్, ఆధార్‌కార్డు ఆన్‌లైన్ ప్రకియను పూర్తి చేయాలని ప్రభుత్వం సూచించింది. అయితే ప్రభుత్వం ఇచ్చిన గడువు ముగిసినా ఆన్‌లైన్ ప్రక్రియ పూర్తి కాలేదు. అయితే ఈ నెల 25వ తేదీలోగా పార్లమెంట్ ఎన్నికల కోడ్ వచ్చే అవకాశం ఉందని ప్రచారం సాగుతుంది. కోడ్ అమల్లోకి వస్తే ఈ ప్రక్రియ అంతా నిలిచిపోయి.. గృహజ్యోతి పథకం అమలు వాయిదా పడే అవకాశం ఉంది.

**జిల్లాలో 4,12,150 గృహ విద్యుత్ వినియోగదారులు..**

కాంగ్రెస్ ప్రభుత్వం ఆరు గ్యారంటీల్లో భాగంగా గృహలక్ష్మి పథకం కింది గృహాలకు 200 యూనిట్ల ఉచిత విద్యుత్ ఇస్తామని ప్రకటించిన విషయం తెలిసిందే. గత నెలలో ప్రజాపాలన కార్యక్రమం నిర్వహించి ఆరు గ్యారంటీలకు దరఖాస్తులు స్వీకరించింది. జిల్లాలో మొత్తం 4,12,150 మంది గృహ విద్యుత్ వినియోగదారులు ఉండగా.. వారిలో 3,96,080 మంది 200 యూనిట్లలోపు విద్యుత్ వాడుతున్నారు. వీరిలో 3.12 లక్షల మంది ప్రజాపాలనలో ఉచిత విద్యుత్ కోసం దరఖాస్తు చేసుకున్నారు. ఈ నెల 15వ తేదీలోగా వారి ఆధార్, రేషన్ కార్డు, మొబైల్, విద్యుత్ సర్వీస్ నంబర్‌ను ఆన్‌లైన్ యాప్‌లో అప్‌లోడ్ చేయాలని విద్యుత్ సిబ్బందికి ప్రభుత్వం ఆదేశాలు జారీ చేసింది.

**పూర్తి కాని ఆన్‌లైన్ ప్రక్రియ..**

ప్రజాపాలన సందర్భంగా 200 యూనిట్ల ఉచిత విద్యుత్ కోసం దరఖాస్తు చేసుకున్న వారి వివరాలను సిబ్బంది ఆన్‌లైన్ యాప్‌లో నమోదు చేస్తున్నారు. కొందరు కొన్ని సర్టిఫికెట్లు, విద్యుత్ సర్వీస్ నంబర్లను ప్రజాపాలన దరఖాస్తులు నమోదు చేయలేదు. అలాంటి వారి ఇళ్లకు విద్యుత్ సిబ్బంది వెళ్లి వారి వివరాలను ఆన్‌లైన్‌లో నమోదు చేయాలని అధికారుల నుంచి ఆదేశాలు ఉన్నాయి. కానీ ఆ ప్రక్రియ ఇప్పటి వరకు పూర్తి కాలేదు. దరఖాస్తు చేసుకున్న 3.12 లక్షల మందిలో ఇప్పటి వరకు 2.30 లక్షల దరఖాస్తులు మాత్రమే ఆన్‌లైన్ అయ్యాయి. ఇంకా మిగిలిన దరఖాస్తులు ఆన్‌లైన్ చేయడంతో పాటు తప్పిదాలు ఉన్న వారి ఇళ్లకు వెళ్లి నమోదు చేయాల్సి ఉంది. ప్రభుత్వం ఇచ్చిన గడువు ముగిసినా ఇంకా నమోదు కొనసాగుతోంది.

**ఇప్పట్లో కష్టమే..!**

గృహజ్యోతి పథకం అమలు కోసం ఫిబ్రవరి 15లోగా దరఖాస్తులన్నీ ఆన్‌లైన్ చేసి ఆ తర్వాత ఉచిత విద్యుత్‌ను అమలు చేస్తామని ప్రభుత్వం గతంలోనే ప్రకటించింది. కానీ ఆన్‌లైన్ ప్రక్రియే పూర్తి కాకపోవడంతో ఉచిత విద్యుత్‌కు అమలుకు మరింత సమయం పట్టే అవకాశం ఉంది. ఫిబ్రవరి నెలకు సంబంధించి విద్యుత్ రీడింగ్ ఇప్పటికే పూర్తయింది. వినియోగదారులు బిల్లులు చెల్లిస్తున్నారు. మార్చి నుంచి ప్రభుత్వం ఉచిత విద్యుత్ అమలు చేయాలనుకున్నా.. ఆన్‌లైన్ ప్రక్రియ పూర్తికాకపోవడంతో ఆ హామీ అమలు ఇప్పట్లో సాధ్యమయ్యేలా కనిపించడం లేదు. ఈ విషయమై విద్యుత్‌శాఖ ఎస్‌ఈ చంద్రమోహన్‌ను వివరణ కోరేందుకు ఫోన్‌లో సంప్రదించగా.. ఆయన ఫోన్ ఎత్తలేదు.

## న్యూస్‌రీల్

### నెలాఖరులోగా సీఎంఆర్ పూర్తిచేయాలి



మాట్లాడుతున్న అదనపు కలెక్టర్ శ్రీనివాస్

నల్లగొండ : ప్రభుత్వ ఆదేశాల మేరకు 2022–23 యాసంగి కష్టం మిల్లింగ్ రైస్ (సీఎంఆర్) లక్ష్యాన్ని రైస్ మిల్లర్లు ఈ నెల 29వ తేదీ నాటికి పూర్తి చేయాలని అదనపు కలెక్టర్ జె.శ్రీనివాస్ ఆదేశించారు. గురువారం తన ఛాంబర్‌లో పౌరసరఫరాల, ఎఫ్‌సీఐ అధికారులు, రైస్ మిల్లర్ల ప్రతినిధులతో సమావేశమయ్యారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ రైస్ మిల్లర్లు మిల్లుల వారీగా కేటాయించిన సీఎంఆర్ లక్ష్యాన్ని ఎట్టి పరిస్థితుల్లోనూ పూర్తి చేయాలని ఆదేశించారు. బాయిల్డ్ రైస్ లక్ష్యాన్ని సైతం పూర్తిచేయాలన్నారు. సమావేశంలో డీఎస్‌ఓ వెంకటేశ్వర్లు, పౌరసరఫరాల జిల్లా మేనేజర్ నాగేశ్వరరావు, శ్రీనివాస్, నరసింహ, రైస్ మిల్లర్ల అసోసియేషన్ నాయకులు నారాయణ, శ్రీనివాస్ పాల్గొన్నారు.

### ఉచిత బస్సు ప్రయాణానికి ఆదరణ



పురస్కార పత్రం అందజేస్తున్న ఆర్ఎం శ్రీదేవి

మిర్యాలగూడ టౌన్ : ఉచిత బస్సు ప్రయాణానికి మహిళల నుంచి ఆదరణ పెరిగిందని ఆర్టీసీ రీజినల్ మేనేజర్ శ్రీదేవి అన్నారు. గురువారం స్థానిక ఆర్టీసీ బస్టాండ్ ఆవరణలో ప్రగతి చక్ర మాస మహాలక్ష్మి పురస్కారం పత్రాలను డిపోనకు చెందిన రమణ, విజయవాణి, సైదులుకు అందజేసి మాట్లాడారు. మహాలక్ష్మి పథకం ప్రారంభం నుంచి ప్రయాణికులకు ఎలాంటి ఇబ్బందులు కలుగకుండా ఆర్టీసీ సిబ్బంది ఎంతో సహనంతో సురక్షిత ప్రాంతాలకు చేరవేశామన్నారు. కార్యక్రమంలో ఆర్టీసీ డిప్యూటీ మేనేజర్లు మాధవి, శివశంకర్, ఆర్టీసీ అధికారులు, సిబ్బంది పాల్గొన్నారు.

### అనుమతి పొందిన చోటే కళాశాల ఉండాలి

నల్లగొండ : అఫ్లియేషన్ ద్వారా అనుమతి పొందిన ప్రాంతాల్లోనే ప్రైవేట్ కళాశాలలు ఉండాలని డీఐఈఓ దస్రూనాయక్ గురువారం ఒక ప్రకటనలో తెలిపారు. జిల్లా వ్యాప్తంగా 53 ప్రైవేట్ జూనియర్ కళాశాలలు ఉన్నాయని ఆయా కళాశాలలు తప్పనిసరిగా అఫ్లియేషన్ పొందాలని.. లేకపోతే టీఎస్‌బీఐఈ (తెలంగాణ స్టేట్ బోర్డు ఆఫ్ ఇంటర్మీడియట్ ఎడ్యుకేషన్ హైదరాబాద్) నిబంధనల ప్రకారం చర్యలు తీసుకుంటామని ఆయన హెచ్చరించారు.

### ఉత్తమ ఫలితాలు సాధించాలి : డీఈఓ



తరగతి గదిని పరిశీలిస్తున్న డీఈఓ భిక్షపతి

చిట్యాల : ప్రభుత్వ పాఠశాలల విద్యార్థులు పదో తరగతిలో వందశాతం ఉత్తీర్ణత సాధించాలని డీఈఓ భిక్షపతి కోరారు. గురువారం చిట్యాల మండలం వెలిమినేడు, గుండ్రాంపల్లిలోని పాఠశాలలను గురువారం ఆయన తనిఖీ చేశారు. విద్యార్థులతో కలిసి ఉపాధ్యాయులు చేప్పే పాఠాలు విన్నారు. మధ్యాహ్న భోజనం, రికార్డులను ఆయన పరిశీలించారు. పాఠశాల్లోని సమస్యలను తెలుసుకున్నారు. కార్యక్రమాలలో ఆయా పాఠశాలల హెచ్ఎంలు నర్సింహారెడ్డి, అంజిరెడ్డి, లింగయ్య ఉన్నారు.

### నేటి నుంచి ఇన్విటేషన్ కబడ్డీ పోటీలు

పెద్దవూర : మండలంలోని తుంగతుర్తి గ్రామంలో శ్రీపార్వతీ సమేత స్వయంభూ సోమేశ్వర స్వామి కల్యాణ మహోత్సవం సందర్భంగా శుక్రవారం నుంచి మూడు రోజుల పాటు రెండు తెలుగు రాష్ట్రాలస్థాయి ఇన్విటేషన్ కబడ్డీ పోటీలను నిర్వహిస్తున్నట్లు శివసాయి యూత్ కమిటీ సభ్యులు గురువారం తెలిపారు. ఈ పోటీల్లో గెలుపొందిన జట్లకు మొదటి బహుమతి రూ.50 వేలు, ద్వితీయ బహుమతి రూ.40 వేలు, మూడవ రూ.30 వేలు, నాలుగవ రూ.25 వేలు, ఐదవ రూ.20 వేలు, ఆరవ రూ.15 వేలు, ఏడవ రూ.12 వేలు, ఎనిమిదవ రూ.10 వేల నగదుతో పాటు షీల్డ్‌లను అందివ్వనున్నట్లు తెలిపారు.

## మట్టపల్లిలో నిత్య కల్యాణం

మఠంపల్లి: మట్టపల్లి లక్ష్మీనరసింహస్వామి దేవాలయంలో శ్రీరాజ్యలక్ష్మి, చెంచులక్ష్మి సమేత లక్ష్మీనరసింహస్వామి నిత్య కల్యాణాన్ని గురువారం అర్చకులు వైభవంగా జరిపించారు. ఈ సందర్భంగా ఆలయంలో ప్రత్యేక పూజలు నిర్వహించారు. కార్యక్రమంలో ఆలయ అనువంశిక ధర్మకర్తలు చెన్నూరు మట్టపల్లిరావు, విజయ్‌కుమార్, ఈఓ నవీన్‌కుమార్, అర్చకులు తదితరులు పాల్గొన్నారు.












# నేడు బ్రహ్మోత్సవాలకు అంకురార్పణ

- చెర్వుగట్టుపై గర్భగుడిలో ప్రత్యేక పూజలు
- పాల్గొననున్న మంత్రి కోమటిరెడ్డి, స్థానిక ఎమ్మెల్యే వీరేశం
- శనివారం తెల్లవారుజామున స్వామివారి కల్యాణోత్సవం

నార్కట్‌పల్లి: మండలంలోని చెర్వుగట్టు గ్రామంలో వెలిసిన పార్వతీ జడల రామలింగేశ్వరస్వామి ఆలయ గర్భగుడిలో శుక్రవారం రథసప్తమి సందర్భంగా ప్రత్యేక పూజలు నిర్వహించి బ్రహ్మోత్సవాలకు అంకురార్పణ చేయనున్నారు. ఈ ప్రత్యేక పూజల్లో రోడ్లు, భవనాల శాఖ మంత్రి కోమటిరెడ్డి వెంకట్‌రెడ్డి, స్థానిక ఎమ్మెల్యే వేముల వీరేశం, దేవాదాయ శాఖ కమిషనర్ అనిల్‌కుమార్, నల్లగొండ కలెక్టర్ హరిచందన పాల్గొననున్నారు.

**రేపు కల్యాణోత్సవం..**

శనివారం తెల్లవారుజామున స్వామివారి కల్యాణం, ఆదివారం తెల్లవారుజామున అగ్నిగుండాలు, సోమవారం తెల్లవారుజామున దోపోత్సవం, సాయంత్రం ఏకాంతసేవ, మంగళవారం ఉదయం రుద్రాభిషేకం, ఏకాంతసేవ, బుధవారం సాయంత్రం గజవాహనంపై స్వామి, అమ్మవార్ల ఊరేగింపు నిర్వహించనున్నట్లు ఆలయ అధికారులు పేర్కొన్నారు.



చెర్వుగట్టు పైకి వెళ్లే మెట్ల మార్గం



గర్భగుడిలోని రామలింగేశ్వరుడు

**ప్రత్యేక ఏర్పాట్లు..**

స్వామి వారి కల్యాణ్యాన్ని భక్తులు తిలకించేందుకు కొండ పైన, కింద 6 ఎల్‌ఈడీ స్క్రీన్లను ఏర్పాటు ఏర్పాటు చేస్తున్నారు. కొండ పైకి వెళ్లే ఘాట్ రోడ్డుకు ఇరువైపులా బారికేడ్లతో పాటు ఘాట్ రోడ్డు వెంట పలు చోట్ల మరుగుదొడ్లు ఏర్పాటు చేశారు. అంతేకాకుండా ప్రతి రోజు రాత్రి కొండ పైన సాంస్కృతిక కార్యక్రమాలు నిర్వహించనున్నారు. కొండ పైన, కింద ఏర్పాటు చేయనున్న ప్రత్యేక ఆరోగ్య కేంద్రాలలో 24 గంటలు పాటు 40 మంది వైద్య సిబ్బంది విధులు నిర్వహించనున్నారు. అంతేకాకుండా 2 అంబులెన్స్‌లను ఏర్పా టు చేశారు. పారిశుద్ధ్య నిర్వహణ పర్యవేక్షణ, నీటి సమస్య పరిష్కరించేందుకు గాను చెర్వుగట్టు పరిసరాలను 8 జోన్‌లు ఏర్పాటు చేసి, 9మంది ఎంపీఓలు, 84 మంది గ్రామ పంచాయతీ కార్యదర్శులు, 310 మంది సిబ్బందిని కేటాయించారు. కొండ పైన, కింద విచారణ కేంద్రాలు ఏర్పాటు చేస్తున్నట్లు పోలీసులు తెలిపారు. భక్తులు తమ వస్తువులను వారే భద్రపరుచుకోవాలని సూచించారు. ట్రాఫిక్‌కు అంతరాయం కలిగించిన వారిపై చర్యలు తీసుకుంటామని నార్కట్‌పల్లి ఎస్‌ఐ అంతిరెడ్డి తెలిపారు.

### భక్తుల కోసం ప్రత్యేక బస్సులు..

బ్రహ్మోత్సవాలకు విచ్చేయుచున్న భక్తుల కోసం నార్కట్‌పల్లి, నల్లగొండ, మిర్యాలగూడ, దేవరకొండ డిపోల నుంచి ఆర్టీసీ ప్రత్యేక బస్సులు నడుపుతున్నట్లు నార్కట్‌పల్లి డిపో మేనేజర్ వెంకటమ్మ తెలిపారు. ప్రతి 5 నిమిషాలకు ఒక బస్సును నడుపుతున్నట్లు పేర్కొన్నారు. హైదరాబాద్, భువనగిరి నుంచి నల్లగొండకు వచ్చే ప్రతి ఆర్డినరీ బస్సు చెర్వుగట్టు గ్రామం మీదుగా వెళ్తుందని తెలిపారు. జిల్లా పరిధిలోని వివిధ డిపోలకు చెందిన ఎక్స్‌ప్రెస్ బస్సులు కూడా ఎల్లారెడ్డిగూడెంలో ఆగేలా చర్యలు తీసుకున్నామన్నారు. వాహనాలకు కొండ కిందనే వివిధ ప్రాంతాల్లో పార్కింగ్ సౌకర్యం కల్పించారు.

## యాదాద్రిలో నేడు రథ సప్తమి వేడుకలు



ఉదయం సేవకు సిద్ధమైన సూర్యప్రభ వాహనం



రాత్రి ఊరేగించేందుకు సిద్ధం చేసిన స్వర్ణ రథం

యాదగిరిగుట్ట: యాదాద్రి లక్ష్మీనరసింహ స్వామి ఆలయంలో శుక్రవారం రథ సప్తమి వేడుకలు నిర్వహించేందుకు ఆలయ ఆచార్యులు, అధికారులు ఏర్పాట్లు పూర్తి చేశారు. వేకువ జామునే ఆలయాన్ని తెరచిన తర్వాత పాంచరాత్ర ఆగమశాస్త్రం ప్రకారం స్వామి వారిని సూర్యప్రభ వాహనంపై ప్రత్యేకంగా అలంకరించి, ఉదయం 6.40గంటలకు ఆలయ తిరు, మాడ వీధుల్లో ఊరేగిస్తారు. అనంతరం తూర్పు రాజగోపురం ముందు గల మాడవీధిలో శ్రీస్వామి వారి సూర్యప్రభ సేవను అధిష్ఠించి, ఆచార్యులు చతుర్వేద పారాయణం జరిపిస్తారు. వెంటనే రథ సప్తమి విశిష్టతను భక్తులకు ఆచార్యులు వివరిస్తారు. ఇక రాత్రి 7గంటలకు శ్రీస్వామి వారిని స్వర్ణ రథంపై ఆలయ తిరు, మాడ వీధిలో ఊరేగించనున్నారు. ఇందుకు సంబంధించి సూర్యప్రభ వాహనాన్ని, స్వర్ణ రథాన్ని ఆలయ సిబ్బందిచే శుభ్రం చేసి సిద్ధం చేశారు.

## బ్యూటీషియన్ కోర్సులో ఉచిత శిక్షణ

భూదాన్‌పోచంపల్లి: మండలంలోని జలాల్‌పురంలో గల స్వామి రామానంద తీర్థ గ్రామీణ సంస్థలో 2 నెలల కాలపరిమితి కల్గిన బ్యూటీషియన్ కోర్సులో నిరుద్యోగ యువతులకు ఉచిత శిక్షణ ఇస్తున్నట్లు సంస్థ డైరెక్టర్ డైరెక్టర్ పీఎస్‌ఎస్‌ఆర్ లక్ష్మి గురువారం ఒక ప్రకటనలో పేర్కొన్నారు. అభ్యర్థులు పదో తరగతి పాసై ఉండి, 18 నుంచి 30 సంవత్సరాల మధ్య వయస్సు కల్గి ఉండాలన్నారు. ఆసక్తి కల్గిన వారు తమ విద్యార్హత సర్టిఫికెట్లతో పాటు ఆధార్‌కార్డు, పాస్‌పోర్ట్ సైజ్ ఫొటోలతో ఈ నెల 21న సంస్థలో నేరుగా హాజరు కావాలని సూచించారు. సుదూర ప్రాంతాల నుంచి వచ్చేవారికి నెలకు రూ.3వేల ఫీజుతో హాస్టల్ వసతి కూడా కల్పించబడుతుందని అన్నారు. ఇతర వివరాలకు 9133908000, 9133908111 నంబర్లను సంప్రదించాలని సూచించారు.

## విద్యార్థుల నైపుణ్యాభివృద్ధికి 'ఎడ్యునెట్' కృషి

- మహాత్మాగాంధీ యూనివర్సిటీ వైస్ చాన్స్‌లర్ గోపాల్‌రెడ్డి



ఎంఓయూ పత్రాలు మార్చుకుంటున్న ఎంజీయూ వైస్‌చాన్స్‌లర్, ఎడ్యునెట్ ఫౌండేషన్ సభ్యులు

నల్లగొండ రూరల్: విద్యార్థుల నైపుణ్యాభివృద్ధికి ఎడ్యునెట్ ఫౌండేషన్ కృషి చేస్తుందని మహాత్మాగాంధీ యూనివర్సిటీ వైస్ చాన్స్‌లర్ గోపాల్‌రెడ్డి అన్నారు. గురువారం యూనివర్సిటీలో ఎడ్యునెట్ ఫౌండేషన్ సహకారంతో సెంటర్ ఆఫ్ ఎక్సలెన్స్ ఏర్పాటు చేసేందుకు ఎంఓయూ చేసుకున్నారు. ఈ సందర్భంగా వైస్ చాన్స్‌లర్ మాట్లాడుతూ.. సాంకేతిక, కంప్యూటర్ రంగాల్లో విద్యార్థుల్లో నైపుణ్యాభివృద్ధికి ఎడ్యునెట్ ఫౌండేషన్ మరింత సహకారం అందిస్తుందన్నారు. రాష్ట్ర వ్యాప్తంగా ఏర్పాటు చేయబోయే 16 సెంటర్ ఆఫ్ ఎక్సలెన్స్‌లలో ఎంజీయూ ఒకటిగా నిలువనుందన్నారు. ఈ సంస్థ ద్వారా అధునాతన సౌకర్యాలతో కూడిన కంప్యూటర్ ల్యాబ్ ద్వారా ఎంసీఏ, ఇంజనీరింగ్ విద్యార్థులకు సాప్, మిషన్ లెర్నింగ్, ఆర్టిఫీషియల్ ఇంటెలిజెన్స్ వంటి అంశాలపై శిక్షణ ఇవ్వనున్నట్లు తెలిపారు. కార్యక్రమంలో యూనివర్సిటీ రిజిస్ట్రార్ అల్వాల రవి, ప్లేస్‌మెంట్ డైరెక్టర్ ప్రశాంతి, మిర్యాల రమేష్, రేఖ, జయంతి, సుధ సంధ్య, మానస, దుర్గాప్రసాద్, ఎడ్యునెట్ ఫౌండేషన్ ప్రతినిధులు రవీందర్‌సింగ్, వాహెద్ షేక్, ప్రదీప్‌రెడ్డి, సుధీర్ పాల్గొన్నారు.




## భారీ బందోబస్తు ఏర్పాటు



చెర్వుగట్టు బ్రహ్మోత్సవాల నిర్వహణకు జిల్లా ఎస్పీ చందనాదీప్తి ఆదేశాల మేరకు ముగ్గురు డీఎస్పీలు, ఆరుగురు సీఐలు, 29 మంది ఎస్‌ఐ, ఏఎస్‌ఐలు, 78 మంది హెడ్ కానిస్టేబుళ్లు, 250 మంది పోలీసులతో పాటు ప్రత్యేక సిబ్బందితో బందోబస్తు ఏర్పాటు చేశాం. బ్రహ్మోత్సవాకు వచ్చే భక్తులు తమ వాహనాలను పార్కింగ్ చేసేలా ఆయా రూట్లలో ప్రత్యేక పార్కింగ్ స్థలాలను కేటాయించాం. – అంతిరెడ్డి, ఎస్‌ఐ, నార్కట్‌పల్లి













